ఘనపూర్ ఆయకట్టుకు సింగూరు నీరు

పుల్కల్, ఫిబ్రవరి 20: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టు నుంచి మంగళవారం ఘనపూర్ ఆయకట్టుకు నీటి పారుదల శాఖ అధికారులు నాలుగోవిడతలో భాగంగా నీటిని విడుదల చేశారు. ఏటా ఘనపూర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తామని అందులోభాగంగానే జల విద్యుత్ కేంద్రం నుంచి 1460 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

ప్రాజెక్టు నుంచి అధికారులు నీటిని దిగువకు విడుదల చేసిన సందర్భంగా నది పరీవాహక ప్రాంతాల ప్రజలు, గొర్లకాపరులు, మత్స్యకారులు అటు వైపుకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 21.9టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.



జల విద్యుత్ కేంద్రం గేటు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీరు

కోర్పోలులో కేంద్ర బృందం పర్యటన

చౌటకూర్, ఫిబ్రవరి 20: పంటల సాగులో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని కేంద్ర వ్యవసాయ శాఖ అధికారుల బృందం రైతులకు సూచించింది. మండలంలోని కోర్పోలు గ్రామంలో ఆర్థిక శాస్త్రం, గణాంకాలు, మూల్యంకన విభాగం, వ్యవసాయ సహకార శాఖ, రైతుల సంక్షేమ వ్యవసాయం, కేంద్ర మంత్రిత్వ శాఖ కృషి భవన్ న్యూఢిల్లీ అసిస్టెంట్ ఎకనామిక్ అడ్వయిజర్ ఆర్‌కే తప్లియాల్ నేతృత్వంలోని అధికారుల బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు స్థానిక రైతులు పుట్టి వీరయ్య, నారాయణ, లోహిత్‌రెడ్డిల నుంచి వివరాలు సేకరించారు. గత వానకాలం సీజన్ నుంచి ప్రస్తుత యాసంగి వరకు పత్తి, వరి తదితర పంటలు సాగు చేసేందుకు ఎంత పెట్టుబడులు పెడుతున్నారంటూ అడిగి తెలుసుకున్నారు. కలుపు ఎక్కువగా ఉండటం, కలుపు తీసే కూలీల ధరలు అమాంతం పెరిగాయంటూ రైతులు వారికి వివరించారు. వరికి నీరు పారించే సమయం లో ఎక్కువ గంటలు నీటిని అందిస్తున్న ట్లు అధికారులు గుర్తించారు. రైతుల నుంచి సేకరించిన వివరాలన్నింటినీ డీఈఎస్ కేంద్ర గణాంక శాఖకు ఆన్‌లైన్‌లో సమర్పించనున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అదనపు ఆర్థిక సలహాదారు ప్రొఫెసర్ శ్రీచేతన్ జయంత్, వ్యవసాయ ఆర్థిక శాఖ సీసీఎస్ డైరెక్టర్ డాక్టర్ సుహాసిని, క్షేత్ర స్థాయి అధికారి డి.శ్రీనివాస్ రెడ్డి, సహాయ స్టాటిస్టిషియన్ టీఎం దినేశ్, ఏఆర్‌వో రాంచరణ్ తేజ్, ఏఆర్‌వోలు సుమన్, గాయత్రి, ఏఈవో లక్ష్మణ్, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ చందాపురం ముకుందం ముదిరాజ్ పాల్గొన్నారు.



కోర్పోలులో వరినారు మడిని పరిశీలిస్తున్న కేంద్ర వ్యవసాయ శాఖ అధికారుల బృందం

మహిళా సంఘాల అభివృద్ధికి చర్యలు

న్యాల్‌కల్, ఫిబ్రవరి 20: మహిళా సంఘాల అభివృద్ధి, ప్రగతిపై దృష్టి కేంద్రీకరించేందుకు కేంద్రప్రభుత్వం లక్పతి దిది యాప్ తీసుకొచ్చిందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. న్యాల్‌కల్‌లో సీసీలు, వీవోఏఎస్, అకౌంట్ ఆపరేటర్లతోపాటు మహిళా సంఘాల సభ్యులకు లక్పతి దిది యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా డిజిటలైజేషన్‌లో భాగంగా కేంద్రప్రభుత్వం లక్పతి దిది యాప్ తీసుకొచ్చిందన్నారు.

సంఘాల ఆర్థిక క్రమశిక్షణ, ప్రగతిపై సమగ్రంగా దృష్టి సారించడమే కాకుండా సంఘాలకు సంబంధించిన పూర్తి సమాచారం, వివరాలను నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు కుమార్, రాజశేఖర్, సీసీలు, వీవోఏఎస్, అకౌంట్ ఆపరేటర్ల పాల్గొన్నారు.

పర్యావరణ వేత్త కిషన్‌రావుకు అస్వస్థత

పటాన్‌చెరు, ఫిబ్రవరి 20: ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ కిషన్‌రావు అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న జాతీయస్థాయి పర్యావరణవేత్తలు ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, శిల్ప మంగళవారం ఆయనను పరామర్శించారు. పటాన్‌చెరు మండలం నందిగామలోని డాక్టర్ కిషన్‌రావు నివాసానికెళ్లి ఆయన ఆరోగ్యంపై తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా పరిశ్రమల కాలుష్యంపై, పటాన్‌చెరు ప్రాంత సమస్యలపై డాక్టర్ కిషన్‌రావు చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు.

ఎన్నో కాలుష్య ఉద్యమాలను రూపకల్పన చేసి ఈ ప్రాంతానికి కాలుష్యం నుంచి రక్షణ కల్పించిన ఘనత ఆయనదేనని కొనియాడారు. త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ప్రజల్లోకి రావాలన్నారు. ఆయనతోపాటు ప్రముఖ పర్యావరణవేత్త దివంగత చిదంబరం సేవలను కూడా గుర్తు చేశారు. సుప్రీం కోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్ వరకు వీరిద్దరు కాలుష్య సమస్యలను తీసుకెళ్లి ప్రజల ఆరోగ్యాలను కాపాడారన్నారు.

డాక్టర్ కిషన్‌రావును పరామర్శిస్తున్న ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి

వైభవంగా ఆదినారాయణుడి రథోత్సవం

జిన్నారం, ఫిబ్రవరి 20 : కొడకంచి ఆదినారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యఘట్టమైన రథోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అలకసేవలో స్వామివారు ఊరేగారు. మంగళవారం మధ్యాహ్నం శ్రీదేవి, భూదేవి సమేతంగా ఆదినారాయణ స్వామి రథోత్సవంపై కొడకంచి గ్రామ పురవీధుల్లో ఊరేగారు. జిన్నారం, గుమ్మడిదల మండలాల ప్రజలతోపాటు పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, వివిధ పట్టణాల నుంచి భక్తులు వేలసంఖ్యలో హాజరై ఆలయంలో స్వామిని దర్శించుకొని బంగారు, వెండి బల్లులను స్పర్శించారు. అనంతరం స్వామి వారి రథోత్సవాన్ని తిలకించారు. రథోత్సవానికి జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ శెట్టి శివరాజ్, మాజీ ఎంపీటీసీ వడ్డె కృష్ణ, వివిధ గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై ఆదినారాయణ స్వామిని దర్శించుకున్నారు.

ఆలయ ట్రస్టీ చైర్మన్ అల్లాణీ రామాజీరావు రథోత్సవానికి వచ్చిన ప్రముఖులకు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఆదినారాయణ స్వామిని దర్శించుకునేందుకు ఉదయం నెమ్మదిగా మొదలైన భక్తుల తాకిడి సాయంత్రం వరకు భారీగా పెరిగింది. స్వామి వారిని దర్శించుకునేందుకు రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. హోమం, చక్రతీరం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

కొడకంచి ఆదినారాయణ స్వామి రథోత్సవం

జోరుగా అక్రమ మైనింగ్

- అందోల్-జోగిపేటలో మాయమవుతున్న కొండలు.. గుట్టలు
- మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతున్న దందా
- మొరం లారీలను స్థానికులు అధికారులకు అప్పగించినా క్షణాల్లో బయటకు
- టిప్పర్‌కు రూ. 6వేల వరకు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపాలని మంత్రి ఆదేశించినా ఫలితం శూన్యం
- ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా చర్యలు



అందోల్: అందోల్ శివారులో మొరం తరలింపుతో ఏర్పడ్డ గుంతలు

అందోల్, ఫిబ్రవరి 20: అందోల్–జోగిపేటలో అక్రమ మైనింగ్ దందా జోరుగా సాగుతున్నది. తిలా పాపం తలా పిడికెడు అన్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే ఈ దందా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. రాత్రికి రాత్రే అక్రమ రవాణా సాగుతుండడంతో అందోల్–జోగిపేటతోపాటు ఎర్రారం, మాసాన్‌పల్లి, సంగుపేట, చందంపేట్, డాకూర్ తదితర గ్రామాల శివారుల్లో కొండలు.. గుట్టలు మాయమవుతున్నాయి. అందోల్–జోగిపేట పరిసర గ్రామాల్లో నిర్మాణాలు జోరుగా సాగుతుండడం, పెద్ద సంఖ్యలో వెంచర్లు ఏర్పడడంతో మొరం, భారీగా అవసరమవుతుంది. దీంతో కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు సంబంధిత శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఇష్టారీతిన మొర్రం తవ్వకాలు జరుపుతూ దందాకు తెరలేపారు. పలుచోట్ల మొరం లారీలను స్థానికులు పట్టుకుని రెవెన్యూ, పోలీసులకు అప్పగించారు. కానీ నిమిషాల వ్యవధిలోనే ఆ వాహనాలు మళ్లీ బయటకు వెళ్లాయని స్థానికులు తెలిపారు. ఒక్కో టిప్పర్‌కు రూ. 6వేల వరకు వసూలు చేస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపాలని మంత్రి అధికారులను ఆదేశించినప్పటికీ ఇక్కడ మాత్రం పరిస్థితులు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి. ఎవరైన ఫిర్యాదు చేస్తే తూతూమంత్రంగా చర్యలు ఉంటున్నాయి.

దీంతో కొండలు, గుట్టలు కరిగిపోతూ ప్రభుత్వ ఆదాయానికి గండి పడడంతోపాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్నది. అక్రమ తవ్వకాలన్నీ అందోల్–జోగిపేట నుంచి సంగారెడ్డికి వెళ్లే ప్రధాన రాహదారులపైనే ఉన్నా సం బంధిత శాఖల ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

అక్రమంగా మట్టిని తవ్వుతూ వ్యాపారాలు సాగించే వారిపై నిఘా ఏర్పాటు చేశాం. ఎవరైన నిబంధనలకు వ్యతిరేకంగా అటవీ సంపదను కొల్లగొడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. అందోల్–జోగిపేటతోపాటు మండల వ్యాప్తంగా ఇటీవల అక్రమ మైనింగ్ జరుగుతున్నట్లు తెలియడంతో సిబ్బందిని అప్రమత్తం చేసి మట్టి, మొరం రవాణాకు అడ్డుకట్ట వేశాం. కలెక్టర్ సైతం ఈ విషయంపై సీరియస్‌గా ఉండడంతో సిబ్బంది రాత్రి సమయంలో సైతం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎక్కడైన అక్రమంగా తవ్వకాలు జరిగితే ప్రజలు సమాచారం ఇవ్వాలి.

– పాండు, ఆర్డీవో, అందోల్–జోగిపేట



జోగిపేటలో డంపుచేసిన మొరం

అందోల్ నుంచి అక్రమంగా తరలిస్తున్న మొరం లారీలు పట్టుకున్న స్థానికులు

ఖాజీపల్లిలో మల్లన్న జాతర

జిన్నారం, ఫిబ్రవరి 20 : ఖాజీపల్లిలోని గొల్లగూడెంలో మల్లన్న జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతరకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హాజరై మల్లన్నను దర్శించుకున్నారు. గొల్లగూడెం నుంచి మల్లికార్జున ఆలయం వరకు యువనాయకుడు కుమార్‌యాదవ్ నిర్వహించిన పొట్టేళ్లతో ఫలహారం బండి ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామస్తులు ఫలహారం బండి ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చిట్ల సత్యనారాయణ, మమతానవీన్‌కుమార్, నాయకులు గద్దె నర్సింహ, ఆంజనేయులు, సురేశ్, మధు, మహేశ్, నరేశ్, ఆకుల కిరణ్, గద్దె గణేశ్ పాల్గొన్నారు.

ఉత్తమ యూనిట్‌గా మై ప్యాడ్.. మై రైట్

గుమ్మడిదల, ఫిబ్రవరి 20: మైప్యాడ్..మై రైట్ యూనిట్‌ను నాబార్డు ఫౌండేషన్ ప్రతినిధులు ఉత్తమ యూనిట్‌గా ఎంపిక చేసి ప్రశంసించారు. గుమ్మడిదలలో గ్రామ సంఘం సభ్యులు, నాబార్డు ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న మై ప్యాడ్.. మై రైట్(సానిటరీ ప్యాడ్స్)యూనిట్‌ను ఉత్తమ యూనిట్‌గా ఎంపిక చేస్తూ నా బార్డు వారు వీడియో చిత్రీకరించారు.

నిర్వాహకులు సానిటరీ ప్యాడ్స్ తయారీ, మార్కెటింగ్‌పై వారి అనుభవాలను చిత్రీకరించారు. నాబార్డు డీడీఎం కృష్ణతేజ మహిళా సంఘాల సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక ఎదుగుదలకు అందిస్తామన్నారు. సమావేశంలో ఏపీఎం సీసీ శివకుమార్, యూనిట్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు అంతిమ పరిష్కారం కాదు

కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 20: ఆత్మహత్యలు అంతిమ పరిష్కారం కాదని తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, అర్థశాస్త్రం, వృక్షశాస్త్రం సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మహత్యల నిరోధక దినోత్సవాన్ని నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలో ఆత్మహత్య చేసుకున్న యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో భాగంగా 2011 ఫిబ్రవరి 19న కళాశాలకు చెందిన బీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి యాదగిరి తెలంగాణ సాధన కోసం ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తు చేశారు. విద్యార్థులు ఎలాంటి కష్టాలనైనా ఎదుర్కోవాలని, పోరాడి సమస్యను సాధించుకోవాలే కాని ఆత్మహత్యలు చేసుకోవడం సరికాదన్నారు. క్షణికావేశంలో ఎవరూ ఆత్మహత్య చేసుకోరాదని, ఆత్మహత్యలతో కుటుంబాలు క్షోభకు గురవుతున్నాయన్నారు. విద్యార్థులు, యువత ధైర్యంతో ప్రతి సమస్యను ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ విజయ, జగదీశ్వర్, పద్మజ, సిద్దులు, అభిజిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్

విజేతలతో డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 20: జిల్లా సైన్స్‌కేంద్రంలో జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో వెంకటేశ్వర్లు విజేతలకు సర్టిఫికెట్లు, మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికితీయవచ్చాన్నారు. 28 మండలాల నుంచి 56 మంది విద్యార్థులు, గైడ్ టీచర్లు, భౌతిక, రసాయన శాస్త్ర, జీవశాస్త్ర ఉపాధ్యాయులు హాజరయ్యారని వెల్లడించారు. పోటీల్లో ప్రథమస్థానంలో న్యాల్‌కల్ మండలం మీర్జాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి సాదియ నౌశీన్, ద్వితీయ స్థానంలో రాయికోడ్ మండలకేంద్రంలోని టీఎంఎస్ విద్యార్థి నిజామూద్దీన్, తృతీయస్థానంలో పటాన్‌చెరు మండలకేంద్రంలోని జెడ్పీజీహెచ్ఎస్ విద్యార్థినీ భవాని నిలిచారని పేర్కొన్నారు. ఈనెల 24న జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, ఎంఈవో వెంకటనర్సింహ గౌడ్, ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి మురళీధర్, ఎఫ్‌పీఎస్‌టీ ప్రధాన సలహాదారు, పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి మదన్‌గోపాల్, జిల్లా ఎఫ్‌పీఎస్‌టీ బాధ్యులు రాజునాయక్, టీబీఎస్ఎఫ్ అధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, బాధ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

పటాన్‌చెరు, ఫిబ్రవరి 20: పటాన్‌చెరు మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. మంగళవారం సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ సుష్మశ్రీవేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సుప్రజావెంకట్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. కర్ధనూర్‌లో రూ. 10లక్షలతో, నందిగామలో రూ.15లక్షలతో సీసీ రోడ్డును నిర్మిస్తారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొల్కొండ నాగజోలతీలక్ష్మణ్, మాజీ సర్పంచ్‌లు భాగ్యలక్ష్మి, ఉమావక్షితీగోపాల్, మాజీ ఉపసర్పంచ్‌లు శ్రీశైలంయాదవ్, వడ్డేకుమార్, ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో హరిశంకర్‌గౌడ్, స్పెషల్ ఆఫీసర్ గోవిందర్రాం, మల్లేశం పాల్గొన్నారు.

రుద్రారం గ్రామంలోనూ రూ.20లక్షల ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, వెంకన్నయాదవ్ పాల్గొన్నారు.



నందిగామలో శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ సుస్మాశ్రీ, జడ్పీటీసీ సుప్రజ

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

పుల్కల్‌లో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పుల్కల్, ఫిబ్రవరి 20: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రమైన పుల్కల్‌లో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 15లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. చిట్టారెడ్డి చెరువు నుంచి మెయిన్ రోడ్డు వరకు కొబ్బరి కాయకొట్టి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతోనే నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ డైరెక్టర్ రాంచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రధానకార్యదర్శి ఎట్టి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బచ్చమొల్ల మాణిక్యం, మాజీ సర్పంచ్ శ్రవణ్‌కుమార్, బోయిని శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు మన్నె విట్టల్, శ్రీనివాస్, మహేశ్, బక్కప్ప, అడివయ్య పాల్గొన్నారు.

పుల్కల్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

నూతన శనగ విత్తనాలతో అధిక దిగుబడులు

జహీరాబాద్, ఫిబ్రవరి 20: శనగ పంటలో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రాహుల్‌విశ్వకర్మ, సరిత తెలిపారు. మంగళవారం జహీరాబాద్ మండలంలోని రంజోల్ గ్రామంలో సంగారెడ్డి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శనగపంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శనగలో అధిక దిగుబడులు సాధించాలంటే రైతులు ఎంబీజీ(నంద్యాల శనగ) 452 రకం వేసుకోవాలన్నారు.

ఈ రకం ఎండు తెగులును తట్టుకొని అధిక పిలకలతో ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశం ఉన్నదన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్‌కుమార్, రైతులు శేఖర్, రామకృష్ణ, జగన్, మల్లేశం, రాములు, వెంకట్, పండరి, కృష్టన్న, శంకర్, శేఖర్ పాల్గొన్నారు.

పుల్కల్ తహసీల్దార్‌గా కృష్ణ

పుల్కల్, ఫిబ్రవరి 20: పుల్కల్ నూతన తహసీల్దార్‌గా మంగళవారం కృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన భాస్కర్‌కుమార్ బదిలీపై జోగిపేటకు వెళ్లగా, నారాయణఖేడ్‌లో విధులు నిర్వర్తించిన కృష్ణ పుల్కల్‌కు బదిలీపై వచ్చారు.

విద్యార్థినికి ఆర్థిక చేయూత

బొల్లారం, ఫిబ్రవరి 20: విద్యార్థినికి వీవీఆర్ ఫౌండేషన్ చేయూతనందించింది. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ కాలనీలో నివసించే వీరేశం కూతురు సౌమ్యశ్రీ ఐఐఐటీకి ఎంపికైంది. మంగళవారం స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ప్రవీణ్‌రెడ్డి విద్యార్థిని ప్రోత్సహించేందుకు వీవీఆర్ ఫౌండేషన్ తరపున రూ.6వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, వెంకీ, మాధవ్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా భాస్కర్‌కుమార్ బాధ్యతలు

అందోల్, ఫిబ్రవరి 20 : అందోల్ తహసీల్దార్‌గా భాస్కర్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అందోల్ తహసీల్దార్‌గా పనిచేసిన అంటోని ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లగా పుల్కల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న భాస్కర్‌కుమార్‌ను కలెక్టర్ అందోల్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీటీ మధుకర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పురుగుల నివారణకు చర్యలు

అందోల్, ఫిబ్రవరి 20: మండల పరిధిలోని కన్సాన్‌పల్లి గ్రామంలో మంగళవారం రైతులు సాగు చేసిన వరి పొలాలను జోగిపేట ఏడీఏ అరుణ పరిశీలించారు. కాండం తొలుచు పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించినట్లు ఆమె తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో రైతులు సాగు చేసిన వరి పంటలో కాండం తొలుచు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నదన్నారు. రైతులు అధికారుల సూచనలు పాటిస్తూ మందులు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకర్, రైతులు పాల్గొన్నారు.

మహిళా సంఘం ఏర్పాటు

జిన్నారం, ఫిబ్రవరి 20: ఊట్ల గ్రామ మత్స్యశాఖ మహిళా సంఘాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బొగురు ఉమ, ఉపాధ్యక్షురాలిగా కంచం సంపతి, ప్రధాన కార్యదర్శిగా బుషిగారి లావణ్య, కోశాధికారిగా దొమ్మ అనిత, డైరెక్టర్లుగా బుషిగారి అనసూజ, కప్పెర లత, పూజారి వీరమణి, పూజారి పెద్దలక్ష్మి, వినోద ఎన్నికయ్యారు.

బడంపేట అడవిలో మంటలు

కోహీర్, ఫిబ్రవరి 20: మండలంలోని బడంపేట శివారులోని అడవిలో మంగళవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. అడవి దగ్ధం అవుతుండడాన్ని గమనించిన స్థానిక రైతులు జహీరాబాద్ అగ్నిమాపక సిబ్బందికి ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో వెంటనే స్పందించిన సిబ్బంది ఘటనాస్థలాన్ని చేరుకొని ఫైర్ ఇంజిన్ సాయంతో మంటలను ఆర్పారు. అగ్ని ప్రమాదం జరిగినా వెంటనే 101 నంబరుకు సమాచారం అందించాలని ఫైర్‌స్టేషన్ అధికారి ప్రశాంత్ కోరారు. ఎవరైనా బీడీలు, సిగరెట్లు తాగి ఎండిన గడ్డిపై పడేయవద్దని సూచించారు. నిప్పు అంటుకొని ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందన్నారు.

సామూహిక రుద్రాభిషేకాలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 20: గుమ్మడిదల లోని కృష్ణానంద ఆశ్రమంలో రంగంపేట మదనానంద ఆశ్రమ పీఠాధిపతి గురు మాధవానంద సరస్వతి పర్యవేక్షణలో సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి ఆశీర్వదించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

రుద్రాభిషేకాలు చేస్తున్న భక్తులు

శివస్వాముల శోభాయాత్ర

అందోల్, ఫిబ్రవరి 20: శివ దీక్షలు చేపట్టిన శివస్వాములు మంగళవారం జోగిపేటలో చేపట్టిన మహాశివుడి శోభాయాత్ర కనులపండువగా సాగింది. భజన, కీర్తనలు ఆలపిస్తూ పట్టణంలోని వీధుల గుండా మహాశివుడి విగ్రహాన్ని వాహనంపై ప్రతిష్ఠించి శోభాయాత్ర నిర్వహించారు. శివ నామ స్మరణతో జోగిపేట మార్మోగింది. యాత్రలో 500 మంది వరకు శివస్వాములు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

న్యాల్‌కల్, ఫిబ్రవరి 20: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మిర్జాపూర్(బి) ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి నృపేన్‌చక్రవర్తి అన్నారు. ఆరోగ్యకేంద్రంలో నవజాత శిశు సంరక్షణపై ఐదు రోజులుగా నిర్వహించిన శిక్షణా శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆశ వర్కర్లకు నవజాత శిశు సం రక్షణ జిల్లా శిక్షకులు జయలక్ష్మి, మేరీ, లక్ష్మి అవగాహన కల్పించారు. ఆశ వర్కర్లు ఎప్పటికప్పుడు గర్భిణులు, బాలింతల ఇండ్లకెళ్లి వివరాలు సేకరించాలన్నారు. వారికి అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్యామల, మల్లికార్జున్, జహీరాబాద్, న్యాల్‌కల్, మిర్జాపూర్(బి) ఆరోగ్యకేంద్రాలకు చెందిన ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మిర్జాపూర్(బి) ఆరోగ్య కేంద్రంలోని శిక్షణాశిబిరంలో పాల్గొన్న ఆశ వర్కర్లు